అసలు కారణం

శ్రీ వేమూరి వేంకట రామనాథం

"అసలు, ఆమెకు ఇష్టంలేదు మొదట్లో—అదిగో, సరో, బస్సు ఆగింది. శంకరంగారు వస్తున్నారు, కొంచెం వెళ్ళి—"

సరోజని ఒక్క గంతున బస్సుదగ్గరకు పోయింది, శంకరాన్ని తోడ్కొనిరావటానికి.

"మనం లోనికి పోదాంపద సుందరం" అంటూ శర్మ అందంగా అన్నీ అమర్చిన హాలులోనికి ప్రవేశించాడు.

సరోజని అంతకుముందు శంకరాన్ని చూడలేదు. అతను కూడ ఆమెను చూసి ఎఱుగడు. ఎవరో బస్సు ఎక్కటానికి పరుగెత్తి వచ్చిన పిల్లవంక చూసినట్లు చూశాడు, నవ్వీ నవ్వనట్లు. ఆమె "నమస్తే" అంటూ అతని వెనకనే రావటంచూసి, ఆమెకూడ ఆనాటి పార్టీకి చెందినదేనని నిర్ణయించుకున్నాడు.

"నమస్తే, నా అదృష్టమండీ, మీలాంటివారి పరిచయం కల్గటం—"

సరోజని కనులు పైకెత్తకే, "ఇది నా అదృష్టమూ—"

"అనుకుంటారు, అంతేనా" అంటూ పెద్దగా నవ్వి ఆమె వంక చూశాడు, ఆమె కూడా తన పరిహాస కోలాహలంలో మునిగి తేలుతుందన్నట్లు.

ఆమెకు నవ్వు రాలేదు. అప్పటికే శర్మ వీధిగడపలో నిలబడి, "హల్లో హల్లో, శంకరంగారు, రండి—మిత్రులను లోపల కూర్చోపెట్టటంలో మీ బస్సుదాకా రాలేకపోయినాను—"

"ఫరవాలేదు, మీ తరఫున ఈమె వచ్చింది, ఎంత చాకచక్యంగా మాటాడగలదండీ!" అంటూ ఆమె వంకకు తిరిగాడు, ఆమె అప్పటికే పదడుగుల దూరంలో ఉన్న లలితను తీసుకు వస్తోంది చేతిలో చేయివేసికొని.

"ఇదిగో లలిత, సరిగా టైంకు వచ్చింది కొరవానిలాగా" అందరు నవ్వుతూ లోపలకు వెళ్ళారు.

మధ్య టేబిల్ మీద ఒక చక్కని రజతపాత్ర...తళతళ మెరుస్తున్నది. సుందరం దాని అందం గమనిస్తూ అన్నాడు, "శర్మా, సాధారణ ప్రజలని మన మనుకుంటామే, వారి భక్తి భావం, వాత్సల్యం నిజంగా వర్ణనాతీతమోయి."

"కాకపోతే, మేమిది కావాలని కోరామా, మా ధర్మం మేము నిర్వర్తిస్తున్నామన్న భావంతో మాకు చేతనైన రీతిగా వారికి వయోవిద్య గరపాము. అంతేగదా. మేము వారికి కలిగించిన నూతన జీవితానికి ఇది కృతజ్ఞతా చిహ్నమట! వద్దంటే విన్నారుకారు."

ఒంటరిగా ఒకమూల నిలబడిన లలితను బుజంమీద తట్టుతూ, సరోజని అన్నది, 'ఎలాఉన్నది లలితా, ఆ...పాత్రమీద పూలు నీ జాకెట్టుమీద కుట్టిన పూలకన్న బాగున్నాయా ?"

లలిత అన్నది, "నీకు జాకెట్టుమీద పూలంటే ఇష్టంలేదు నిజమే కాని, మీరుచేసిన పనికి మెచ్చి మీ కిచ్చిన బహుమానం మీద పూలయినా నీకు అందంగా ఉంటాయా సరోజనీ ?"

శర్మ అందుకున్నాడు, "నీకు తెలుసో తెలియదో, లలితా అసలీ సరోజనికి మాతోపాటు మొదటిలో వయోజనవిద్యా—ఉద్యమంలో కలిసి పనిచేయటం ఇష్టమేలేదు."

"మీ సరోజని నాకు క్రొత్తా? కాని ఇంతధైర్యం ఎలా వచ్చిందా అని మాత్రం—ఏం సరోజనీ, స్త్రీ లింత ధైర్యంగా ముందుకు రావచ్చునా" అంటూ నవ్వింది.

శంకరం పెద్దపెట్టున నవ్వుతూ, "మీ వంటి వారుంటేగాని పార్టీలు ఆనందంగా గడిచిపోవండీ" అంటూ లలితను దరిచేరాడు. లలిత వానిచేతికి కూల్ డ్రింక్ ఒకటి అందించింది.

సుందరం తనగ్లాసు పైకెత్తి "ఈ ఊరిలో గొల్లపాలెంలో వయోవిద్యను గరపుతూ 800 మందికి అక్షరాస్యతను ప్రసాదించిన శర్మకు, అతని మిత్రవర్గానికి మన అభివందనాలు" అంటూ శర్మ చేతిలోని గ్లాసుకు తగిలించాడు.

లలిత సాండ్ విచ్ లున్న ప్లేటు అందరకూ అందిస్తూ, "ఇవి నీవే చేశావా సరోజనీ" అన్నది.

సరోజని ఒక్క త్రుటిలో నవ్వు, నవ్వుమఱచిన ఆశ్చర్యం, చూపుతూ, "నేను ఇంతకుముందే వచ్చాను మా యింటినుంచి" అంది.

సుందరం, శంకరం శర్మ చూపించే ఫోటోలను ఉత్సాహంతో చూస్తున్నారు. ప్రక్కనేఉన్న గ్రామఫోను రికార్డుల మీదకు వారిదృష్టిపోయింది. అవన్నీ ఒక్కొక్కటి తీసిచూశారు. చివరకు సుందరంఅన్నాడు, "శర్మా, మొన్నటి తెలుగు రికార్డు లేమయినాయి? చాల బాగున్నాయి!"

'అవి మనవికావుగా శేషుదగ్గరనుంచి తీసుకువచ్చాను. చాలా బాగున్నాయి కాదు!"

"ఊ అవి మాకంపెనీకి కొన్నా బాగుండు నమ్ముకొంటాను. అవి ఇప్పుడు తెప్పిస్తే బాగుంటుందోయి చక్కనిపాటలు—"

అవును చక్కని పాటలే, తెప్పిస్తే బాగుంటుంది. శర్మ తటాలున సరోజనివంక చూశాడు. సరోజని తన మఫ్లర్ మెడకు చుట్టుకొని, "నేను వెళ్ళి తీసుకువస్తానండీ" అంటూ వీధివైపు బయలుదేరింది.

సుందరం చిన్నబోయిన మొగంతో అన్నాడు, "మీరు, మీ రొక్కరూ వెడతారా, నాకోసం! నా కంత బాగుండలేదు."

"ఫరవాలేద"ని శర్మ, సరోజని ఏకకంఠంగా పల్కారు.

తటాలున శంకరం అన్నాడు, "నేను మీకు తోడువస్తాను. ఏదీ, చేయి కడుక్కొని వస్తాను." అంటూ బాత్‌రూమ్ వైపు వెళ్ళాడు. లలిత వానివెంట వెళ్లింది తుండుచేతపట్టుకొని.

"సరో, త్వరగారా. బస్సుమీద పోయిరండి పదినిమిషాల కన్న ఎక్కువపట్టదు."

"నాకోసం మీకు వృథాశ్రమగదా" అన్నాడు సుందరం.

"ఫరవాలేదులే సుందరం. అన్నట్లు, నీకు వచ్చిందా సరోజని! ఇదే ఇంటర్వ్యూకి అనుకో. ఉద్యోగం ఇస్తారుకదూ సరోజనికి?".

సుందరం నవ్వుతూ అన్నాడు, "రికార్డులు త్వరగా తెస్తే సరి."

శంకరం తిరిగి వచ్చాడు, సరోజనివెంట బైటకు నడచాడు. వారి అదృష్టం, వీధిలో కాలుపెట్టగానే బస్సు అందింది.

అసలా రోడ్డుమీద బస్సులు ఎక్కువగా తిరుగుతూనే ఉంటాయి కాని, ఒక్కొక్కప్పుడు ఎంత వ్యవధిగానో వస్తాయి. పైగా జనం క్రిక్కిరిసి ఉండటంవల్ల సీటుకూడా దొరకకపోవచ్చును. అక్కడ శేషు యింట్లో ఉన్నాడు కూడ. అడగగానే రికార్డులు ఇచ్చాడు.

సరిగా పదినిమిషాలలో వచ్చి వాలింది సరోజని. సుందరం తన అభినందనాలు తెలిపాడు. సరోజని సరాసరి పోయి గ్రామఫోను పెట్టింది. లలిత అడిగింది, "ఇంతకు శంకరంగారిని ఎక్కడ దాచివచ్చావు సరోజనీ?"

"వస్తారు, కాచుకో,...తరువాతి బస్సులో—"

అంటూఉండగానే శంకరం కూడ అరుదెంచాడు, "అబ్బ, ఈనాడు బస్సు లెంత క్రిక్కిరిసి ఉన్నాయి" అనుకుంటూ. ఎవరు తనవంక ప్రత్యేకంగా చూడలేదు. సరాసరి గ్రామఫోను దగ్గరకు పోయినాడు, 'చాల చక్కని పాటకాదూ' అనుకుంటూ.

సరోజనికి దాహమయినట్లుంది, లోపలికిపోయి ఒక గ్లాసుతో నీళ్ళు తెచ్చుకున్నది. రికార్డు అయిపోగానే, పోయి పిన్నుమార్చి, కీ యిచ్చి, మరొక రికార్డుపెట్టింది. అలా ఇరవైముప్పది నిముషాలు గడచిపోయినాయి. మధురమయిన గీతాలతో రికార్డులు గిర్రున తిరుగుతున్నాయి. కదిలించే తలపులేవో సరోజని హృదయాన్ని గిర్రున త్రిప్పుతున్నాయి. పాటకొక్క క్రొత్తపిన్ను తగిలించుతోంది. మాటిమాటికి తన మనఃఫలకాని కేదో గ్రుచ్చుకొన్నట్లు ఉన్నది. పాటలలో రాగాలాపన శ్రావ్యంగా ఉన్నది. తనలో మాత్ర మేదో రహోవిలాపం అస్ఫుటంగా పొరలుకు వస్తున్నది.

పార్టీ ఎప్పుడు పూర్తిఅయిందో ఆమె కనిపెట్టనేలేదు, లలిత వచ్చి పాడేపాడే రికార్డు ఆపేవరకు. ఒకరినొకరు చిరునవ్వుతో సాగనంపుకున్నారు.

గ్రామఫోను మూసి సరోజని లోనికిపోయి కూర్చున్నది టేబిల్ మీద తలవాల్చుకుని. శర్మ తన చిన్న సూట్‌కేసును తెచ్చి టేబిల్‌మీద పెట్టాడు. "సరో, ఏమలాఉన్నావు; శేషుదగ్గరకు వెళ్ళివచ్చినప్పటి నుండి?"

వెక్కివెక్కి ఏడుస్తూ అన్నది, "నన్ను ఒంటరిగా పోనిచ్చినా బాగుండేది...ఎంత సిగ్గయింది బస్సులో! నా కెలాగో ఒక సీటు దొరికింది, కూర్చున్నాను. ఆ శంకరంగారికి సీటులేదు. కండక్టరు "ఎవరూ నిల్చోనరాదు, కూర్చోండి" అంటున్నాడు. శంకరం గారు జరగమన్నట్లు నావంక చూశాడు. నేనుమాత్రం వానివంక చూడనట్లు కూర్చున్నాను. కండక్టరేమో, "సీటు లేకపోతే మరొక బస్సులోరండి" అన్నాడు శంకరంగారితో. ఈయనమాత్రం, "కాదబ్బాయి, మేమిద్దరం ఒకటే, కలిసిపోవలసిన అవసరమున్నదన్నాడు." "నన్నేమి చేయమన్నారు, మరి కూర్చోండి అయితే, నిల్చోవటానికి మాత్రము వీలులేదు—పోలీసుస్టేషను ముందు ఉన్నది," అన్నాడు కండక్టరు. ఇంక ఏంచెయ్యను, నేను కొంచెం జరగక తప్పిందికాదు, ఆ యిరుకుసీటులో—" అంటూ కన్నీరు గ్రమ్ముకుంది.

"తిరిగి వచ్చేప్పుడు? ఆయన వెనుక ఎలా పడ్డారు?"

"నేను కొంచెం తెలివిపడ్డాను. బస్సు ఆగింది. ఆయనను ముందు ఎక్కమన్నాను. నేను చీర కాలికి అడ్డుపడ్డట్లు నటించి ప్రక్కకు తిరిగి సర్దుకుంటున్నాను. కండక్టరు నావంక తిరిగినప్పుడు తన బస్సు పోవచ్చునన్నట్లు చూశాను. అయితే నేను అక్కడే దిగబడ్డాను. బస్సుపోయింది."

"మరి నీవే ముందువచ్చావే!"

"వినండి. ఆ శంకరంగారు తెలివితక్కువవాడా ఏం! తరువాతి బస్సుస్టాపుదగ్గిర దిగి నాకోసం కాపువేశారు. నా అదృష్టవశాత్తు, నేను తర్వాత ఎక్కిన బస్సు మరీ క్రిక్కిరిసి ఉండటంచేత ఆ స్టాపుదగ్గర అసలు బస్సు ఆగనేలేదు."

"కథలోలాగ అయింది సరో" అంటూ శర్మ సూటుకేసు తెరిచాడు. ఎవరో బయట దగ్గినట్లు వినపడింది. "ఎవరు" అంటూ బైటకు తొంగిచూసేలోగా సుందరంగారు అగుపడి, "క్షమించండి మిమ్మల్ని *disturb* చేసినందుకు. సరోజనిగారు నా కారులో వస్తే వారి యింటిదగ్గర దింపిపోతాను" అన్నాడు.

"ఏం సరో—"

"వద్దు, మీకు కృతజ్ఞతలండీ. నన్ను ఒంటరిగా పోనీయండి" అంటూ సరోజని లేచి నిలిచి వానికి నమస్కారంచేసింది. సుందరం కారు బుర్రుమన్నది, శర్మ వానిని సాగనంపి లోనికి వచ్చాడు.

సరోజని సూటుకేసులోని నీలం జాకెట్టు గుడ్డను బైటకు లాగింది. "ఏం, ఇది నాకోసమేగా మీరు తెచ్చారు?"

"సరిపోతుందా సరో, నాకు ఎంత తేవాలో తెలియలేదు"

గుడ్డ మూరతో కొలిచిచూచి, "ఓ చక్కగా సరిపోతుంది. నాకు ఉద్యోగం వచ్చిన మరునాడు దీనితో అందమైన క్రొత్త ఫాషనులో జాకెట్టు కుట్టుకు మీకు కనపడుతాను."

"మంచిదే సరో" ఇద్దరు బైటకు నడిచారు.

దాదాపు సరోజని యింటిదాకా శర్మ వెంట వెళ్ళాడు. తన వయో విద్యోద్యమంలోని తరువాత కార్యక్రమంగురించి, ఆనాటి

తను పార్టీనిగురించి, అవీ యివీ మాట్లాడుకుంటూ వెళ్లారు. మధ్యలో సరోజని అన్నది "ఆ లలిత యిల్లు ఇదే" అని.

శర్మ అడిగాడు, "లలిత అంటే నీతో యింటరు చదివి తరువాత బి. యే.లో చేరింది, ఆ పిల్లేకదూ."

"అవునవును, నేను బి. యే. ఆనర్సు అని మా గర్వంకదూ" అంటూ సరోజని తన యింటిగుమ్మంవైపు గంతువేసింది.

* * * *

సరోజని ఆవేళ ఎన్నడు పడుకొని ఎఱుగదు. జుట్టు చెదరిపోయింది. మధ్యాహ్నం ఉత్సాహంతో తలలో పెట్టుకున్న గులాబీపూలు గదినిండా రెక్కలపాన్పులలా అయిపోయినాయి. కంపెనీనుంచి వచ్చిన ఉత్తరం టేబిల్ మీద హేళనచేస్తున్నట్లు గాలికి టపటపలాడుతూంది.

సరోజని కన్నీటికి అంతులేదు. దిండు పూర్తిగా తడిసిపోయింది. ఏడ్చి ఏడ్చి కన్నులు ఎఱ్ఱపడిపోయినాయి.

పది రోజులక్రిందనే తనకు కంపెనీలో ఉద్యోగం నిశ్చయంగా ఇస్తానని సుందరంగారు చెప్పారు. సుందరం శర్మ చాలా ముఖ్య స్నేహితులు. శర్మ కేది యిష్టమో, ఏది ప్రియమో, అది సుందరం చేస్తాడు. కాని తనకు మాత్రం లేబర్ ఆఫీసరుపని రాలేదు. తన డిగ్రీ కాని, తన తాహతు గాని తక్కువని కాదు. తనకు కాలేజీలో ఎన్ని బహుమానాలు రాలేదు......

తన మనసులోని భావాలలాగానే విసురైన గాలి తెరలు దూసుకువస్తున్నాయి గదిలోకి. కిటికీలోంచి క్రిందకు జారిపడిన వార్తాపత్రిక చెల్లాచెదరై అటూ ఇటూ కొట్టుకుంటూ ఉన్నది మంచంకోళ్ళవద్ద, పెట్టెల సందులలోను. తలయెత్తి చూసింది టేబిల్ మీద ఉంచిన రిస్టువాచివైపు. అయిదు గంటలయింది. ఒక పెద్ద గాలికెరటానికి టేబిల్ క్లాత్ ఎగిరి గడియారం క్రింద పడిపోయేదే, తటాలున ఆమె లేచియుండకపోతే.

ధరింపరాని గాలిహోరు తప్పించుకొనటానికి గది తలుపు వేసింది. ఏమి చేయాలో తోచలేదు, తిరిగి మంచంమీద మేను వాల్చింది. తన నిప్పుడు మరొక ఊహ వేధించ మొదలిడింది. తనను అందరికన్న ఎక్కువగా ప్రేమించిన శర్మగారెంత ఖిన్నుడై ఉంటాడో, యీ వార్త విని. అతని హృదయంలో రెండుగాయాలు. ఒకటి తనకు ఉద్యోగం రాలేదని. రెండు తన మాట, తన పరపతి విఫలమయినవని.

తనింత దుఃఖసముద్రంలో మునిగిఉన్నది. మంచిజీతం వచ్చే ఉద్యోగం పోయినందుకు శర్మ హృదయ మెంత దహించుకుపోతోందో, తనకున్న విశ్వాసం, తనమీద యితరులుంచిన విశ్వాసం తరిగిపోయినవని!

సరోజని తటాలున లేచింది, తలుపు తెరచింది. బయట నుండి ఈదరగాలి ఒక్కసారిగ విసురైనశూలంలా లోనికి గ్రుచ్చుకుపోయింది. కాని తన మనస్సులో రేగిన క్రొత్త తలపుల బలంలో ఇదేమీ పాటించలేదు. పోయి శర్మను చూడాలి. త్వరత్వరగా తలదువ్వుకొని చీర సర్దుకొని బైట సావడిలోకి వచ్చింది.

గడియ తెరచింది వీధితలుపు. ఎంతసేపోగా ఆ గాలి దుమారంలో తలుపుకొడుతూ నిలుచున్నదో కాని, లలిత ఎదురుగా దర్శనమయింది.

"నీవా, ఇంతగాలి తుఫానులో—" అంటూ తిరిగి లోనికి వచ్చింది సరోజని.

"సరోజనీ, క్షమించు. ఎక్కడికో పోతోగున్నట్లున్నావు. నిజానికి నీవనుకున్నంత గాలి తుఫాను లేదమ్మా. లోపలకూర్చుంటే అలాగే అనిపిస్తుంది, కిటికీలు పగులుతూ, తలుపు లదేపనిగా కొట్టుకుంటూ."

"అందుకే బైటపడ్డాను"

ఇరువురు పదకుతులు ముందుకు వేశారు, ఏమి మాటాడాలో తెలియని శిశువులలా మెల్లగా లలిత అన్నది, "సరోజనీ, నీకు తెలిసేఉంటుంది—!

"అవును. ఇందాకనే కంపెనీ జవానువచ్చి ఉత్తరం ఇచ్చిపోయాడు. ఉద్యోగం వచ్చిందనుకొని ఆత్రంతో కవరు చింపి చూశాను—"

"సరోజనీ, ఇదే నేను దురదృష్టమంటాను—"

"కావచ్చును తగు కారణం నాకు కన్పడ్డం లేదు మరి"

"విను సరోజనీ, నీకు నాకు పోలిక ఏమిటో చెప్పు—"

సరోజని ఆమెవంక చూసింది. నవ్వు తెప్పించుకొని అన్నది "చూడు లలితా, మనిద్దరం ఎఱ్ఱగా ఉన్నాము. అదొక పోలిక"

"బాగుంది"

"మనిద్దరి జడలు పొడవు. అది మరొకపోలిక—"

"నవ్వకమ్మ సరోజనీ చదువులోకాని, బుద్ధి విశేషములోకాని నీవు నాకన్న మిన్న. నీవు ఆనర్సు ఫస్టుక్లాసులో ప్యాసయినావు. నేను సీటురాక, బి. యే లో ప్రజాబాహుళ్యంతోపాటు ప్యాసయిన దానిని"

"ఏంలాభం లలితా, నాకేమైనా ఒరిగిందా ఫస్టుక్లాసులో ప్యాసయితే" కొంచెంసేపు ఇరువురు నిశ్శబ్దంగా నడిచారు. ఎన్నో లాంతరు స్తంభాలు గడచిపోతున్నాయి. తటాలున సరోజని ఆగి, మరి నాకు ఉద్యోగం రాకపోవటానికి కారణమేమిటో చెప్పు లలితా?" అని గ్రుచ్చినట్లుగా ప్రశ్నించింది.

లలితమొగం కొంచెం తెల్లపడ్డది. అప్పుడే ప్రక్కనున్న లాంతరు స్తంభము తళుక్కుమన్నది. ఆ వెలుగును భరించలేక తల వంచుకొన్నది.

మఱల కొన్ని అడుగులు ముందుకు వేశారు. లలిత అన్నది, తలయెత్తకే "సరోజనీ, నీవు వేఱుగా తలంచకుండాఉంటే ఒక విషయం చెపతాను. నాకెందు కీఉద్యోగం వచ్చిందో నిజంగా నాకు తెలియదు నమ్మి; కాని నీకెందుకు రాలేదో నాకు చూచాయగా తెలుసుననుకుంటాను"

సరోజనిపాదాలక్రింద భూమి బ్రద్దలయిన ట్లనిపించింది. తనకు రాని ఆ ఉద్యోగంలో లలితను నియమించారా! లలితను!

దొంగదొంగగారాలే కన్నీటిబిందువులలో చేతిరుమాలును తడిచేస్తూ అన్నది, "లలితా, నన్ను క్షమించు. నీకీఉద్యోగం వచ్చిందని నాకు నిజంగా తెలియదు; నమ్ము; ఈ క్షణందాకా తెలియదు. నీవు నా శుభాకాంక్షలు నన్ను అపార్థం చేసికోకు. నన్ను క్షమించు"

సరోజని వదనం హెచ్చించింది. లలిత కూడ తన వెంటనే పరుగెత్తినట్లు నడుస్తోంది. వీధిత్రోవపొడవున్న మ్యునిసిపల్ దీపాల వాడువన్నా స్తంభాలకున్న విద్యుత్తుల కొక్కొక్కటే నొక్కుతూ పోతున్నాడు. ఇక రెండు స్తంభాలుదాటితే చాలు శర్మయిల్లు వస్తుంది. విచారిస్తున్న శర్మను తాను అనునయిస్తుంది. తనకు సానుభూతిమాటే శర్మగారి వాత్సల్యంలో మనశ్శాంతిని పొందుతుంది. తటాలున ఏదో ఊహ తట్టినట్లు ఆగింది. "లలితా ఈ ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పు, నాకు ఉద్యోగం రాని కారణం—"

"సరోజనీ, నీవు నన్ను అపార్థం చేసికోవద్దు. నేను విన్న కారణ మిది. విన్నదేసుమా. అయినా ఇది రూఢియైనదని చాల మంది చెప్పారు. నీవు క్రిందటి ఏడంతా శర్మగారి కూటమిలో చేరి వయోజన విద్యోద్యమంలో కాలం గడిపావు కాదూ—"

"అవును, అది నా ఉద్యోగానికి పనికివచ్చే యోగ్యతక్రిందకే వస్తుందిగా—"

"ఈ తిరుగుడు ప్రశ్నలకు సమాధానమిచ్చే యోగ్యత నాకుంటే నేనూ అనర్హు దవిని ఉండేదానిని."

"అనర్హని నన్ను ఈసడించనక్కరలేదు లలితా, చెప్పు నీ కారణేని, నీవు చెప్పదలచుకొన్నది."

"విను సరోజనీ, అది సుందరంగారికి ఇష్టంలేదట, అందు వల్ల—"

"అందువల్లనా? అంటే, లలితా, కొంచెం విప్పిచెప్పవూ నేను శర్మగారితో కలిసి ఆ ఉద్యమంలో పనిచేశాననా? లేక నే నట్టి ఉద్యమంలో పాల్గొన్నాననా?"

"సరోజనీ, నీ ప్రశ్నలకు సమాధానమిచ్చే వాక్చక్యం నాకు లేదమ్మా. ఇక నన్ను అడుగకు."

సరోజని పాదాలు ముందుకు దొరలుతున్నాయిగాని, ఆమె ముందుకు పోతోందో వెనుకకు పోతోందో తెలియని మనస్థితిలో సాగిపోతోంది. అప్పటికే మ్యునిసిపల్ జవాను లాంతరులన్ని వెలిగించి తిరిగి వస్తున్నాడు. కాని సరోజని కన్నులకంతా చీకటిగానే ఉంది.

కేవలం ఉద్యమంలో పనిచేసినందుకా? కాదేమో అలాంటి అనుభవం కార్మికస్త్రీల శ్రేయస్సు కగోనవలసిన ఉద్యోగాని కెంతో ఉచితమే గాక అవసరంకూడా గదా. పైగా ఆనాటి పార్టీకి సుందరంగారు దయచేసి హృదయపూర్వకంగా అభినందించారే. మరి, శర్మగారి మైత్రితో తను పనిచేసినందుకా? లలిత ఏమన్నది? వివరంగా చెప్ప నేలేదు.

ఈ ఊహా పరంపరలో తేలిపోయే సరోజనిని పోస్టుమాను ఆపాడు. తటాలున ఒక ఎక్స్‌ప్రెసు ఉత్తరం ఇచ్చాడు. వణికే చేతులతో అది చదువుకొన్నది. ఇంటివద్దనుండి తల్లి వ్రాసింది:

"సరో, ఈపాటికి నీ ఉద్యోగ శుభవార్త నీకు చేరిఉంటుంది. రాత్రి నీవు పడుకునేలోగా ఈ ఉత్తరం అందవలెనని నా కోర్కె. శర్మగారికి తప్పక చూపు."

ఉత్తరం చేతిసంచిలో పడవేసింది. రుమాలు మూసుకుపోయే పెదవుల కాచ్ఛాదంగా కప్పుకు నడుస్తోంది. లలిత తన ప్రక్క నున్న మాటే మరచిపోయింది, తన భుజంపట్టుకొని "అయితే ఎక్కడికు వెళుతున్నావు సరోజనీ యింత విచారములో? శర్మ గారి యింటికా?" అ నేవలను.

సరోజని తటాలున ఆమెవంక తిరిగి అరిచింది, "కాదు తల్లీ కాదు. శర్మగారింటికి కానేకాదు."

ఇక ఇరువది అడుగులువేస్తే శర్మగారి యిల్లు. కుడిప్రక్క రోడ్డుకు మళ్ళింది; గబగబా అంగలు వేసికొంటూ. లలితకు అర్థం కాలేదు ఎటుపోతోందో, తాను వెంటపోవటం సమంజసమో కాదో. ఏమీతోచని బొమ్మలా నిలచిందొక నిముషం సేపు.

పై అంతస్తునుండి శర్మ గమనించాడు సరోజని అటుప్రక్క రోడ్డుమీదనే నడవటం. గబగబా దిగాడు, తన చిన్ని చెల్లాయితో సహా. శేలీ అన్నది, "అన్నయ్యా, అది సరోజని అక్కయ్య అన్నయ్యా...పద పిలుస్తాను. ఇందాకటినుంచి యిక్కడ మనం తనకోసం వేచిఉంటే అలా పరుగెత్తుతోందేం—"

సరోజని అప్పటికే ఏబది గజాల దూరంలో ఉంది. శర్మ నడి వీధిని పరిగెత్తితే ఏం బాగుంటుంది. శేలీని పంపాడు, పిలుచుకు రమ్మని.

శేలీ ఒక్క పరుగునపోయి సరోజని చేయి పట్టుకు లాగింది. వెనుదిరగక నడుస్తూ, సరోజని శేలి బుగ్గ నిమురుతూ ఏదో మాటాడి పంపి వేసింది.

శేలి తెల్లమొగంతో తిరిగివచ్చింది శర్మదగ్గరకు. "అన్నయ్యా, రమ్మని ఎంతో అడిగాను. ఏడ్చాను, చూడు నా కన్నులు, రానంది. తనకు జలుబుగా ఉందట. విక్సు కొనుక్కోటానికి పోతోందట మందుషాపుకు."

"విక్సా"?

"ఊఁ విక్సు ఏమిటి అన్నయ్యా! నిజంగా విక్సుతో సరోజనీ అక్కయ్యబాధ తీరుతుందా అన్నయ్యా."

* * * *

వచ్చిన అతిథులందరూ ఒకరొకరుగా వెళ్ళిపోయినారు. పదవ్యంప్రసపల్లెలో వయోజనవిద్యను ప్రారంభించే నిమిత్తం ఆ సాయంత్రం సభఒకటి జరిపారు శర్మయింటిలో. అందరు తమ తమ ఉత్సాహం ప్రదర్శిస్తూ ఉపన్యాసాలిచ్చారు, శర్మకు సహాయం చేస్తామని వాగ్దానంచేశారు.

శర్మకుమాత్రం అంత ఉత్సాహంగాలేదు. ఇది లలిత కని పెట్టింది. తాను వెళ్లిపోయేముందు అన్నది "శర్మగారు ఈరోజు మీరు అదోకలాగా ఉన్నారండి—"

"ఏం లలితా" అంటూ తని చిరునవ్వు తెప్పించుకు పలి కాడు శర్మ.

లలిత పూలకుర్చీమీద చతికిలపడింది. మెల్లగా అన్నది, "మీరు తప్పక వస్తారనుకొన్న సుందరంగారు రానేరాలేదు."

శర్మఅన్నాడు "అంతేకాదు, నేను అంతకన్న ముఖ్యంగా వేచియున్న సరోకూడ రాలేదు. ఆమె ఆరోగ్యం ఎలా ఉన్నదో ఏమో."

లలిత నిశ్శబ్దంగా కూర్చొనిఉంది. శర్మ ప్రారంభించాడు, "ఇరవైరోజులనుంచి కనపడనేలేదు సరో. ఇందరువచ్చి యింత సందడిగా కార్యక్రమం నడిచినా, నాకేదో కొరత జరిగినట్లే ఉన్నది."

లలిత అన్నది, "అవును ఎవరిమీద వాత్సల్యం ఎక్కువగా ఉంటుందో వారు రాకపోతే అలాగే అనిపిస్తుంది శర్మగారూ. ఇంతకు మీరు ప్రేమించినంతగా మిమ్మ ప్రేమించే ఆ సరోజని రాకపోయే కారణం ఏముంటుంది?"

"ఏమో" అంటూ శర్మ నిట్టూర్చాడు. లేచి అటు ఇటు మెల్లగా నడిచాడు. కిటికీలోనుండి బైటకుచూస్తూ అన్నాడు, "లలితా, నీతో ఈ విషయం ప్రస్తావించటం అనుచితమని నాకు తెలుసు. అయినా—"

"అలా అనకండి శర్మగారు. మీరు నాతో ఏవిషయమైనా—"

"విను లలితా. ఆమె రానికారణం నేను ఊహించగలను. తాను తప్పక వస్తుందని ఆశించిన ఉద్యోగం తనకు దక్కనందువల్ల ఎంతో చిన్నబోయి విచారిస్తూ ఉంటుంది."

లలిత తలవంచుకొని "కావచ్చును" అంటూ రుమాలుతో చెక్కిళ్లు తుడుచుకున్నది. శర్మ అటు తిరిగి ఆమెను సూక్ష్మంగా గమనించి అన్నాడు "లలితా ఆమె ఉద్యోగం మాట ఎత్తితే నీ ఉద్యోగప్రాప్తినిసురించి ముచ్చటించినట్లు అవుతుందిగదా. ఇందుకే నేనెంతో జంకి యీ విషయం స్పృశించాను"

"ఫరవాలేదు. కాని నాకీ ఉద్యోగం ఎందుకు వచ్చిందో మాత్రం నేను చెప్పలేను"

"పోనీ మాసరో కెందుకు రాలేదో చెప్పగలవా?"

లలిత తటాలున తలఎత్తి శర్మవైపు చూసింది. ఈ ప్రశ్న అనుకోనంతరూక్షంగా సూటిగా తనహృదయానికి తగిలింది. శర్మ కన్నులు రెండు ప్రశ్నా సూచకంగా ఆరనిదీపాల్లా వెలిగినాయి.

లలిత మెల్లగా అన్నది "మీ ప్రశ్న అంత సులభంకాదు సమాధానం" తనచేతిసంచి తీసుకొని పవిట అలవాటుగ సర్దుకుంటూ "నన్ను పోనీయండి" అంది.

తాను ఊహించనంత గంభీరంగా కనపడింది. ఈవిషయ మంతా. శర్మ అన్నాడు, "లలితా, క్షమించు. నీకు కష్టం కలిగే సమాధానం ఇమ్మని నేను నిర్బంధించనులే"

లలిత తటాలున పలికింది, "నాకుకాదు, మీకు కష్టం కలుగవచ్చునని నా భయం."

"నాకా? క్షమించు లలితా, వినవలెనని నాకు కుతూహల మవుతోంది." చెప్పులలితా, చెప్పవూ."

లలిత తన చేతిసంచీ తిరిగి టేబిల్‌మీద పెట్టింది. పవిట అంచుతో కనుకొనలు తుడుచుకుంటూ, "కాని నేను చూచాయగా విన్నదే సుమా, ఇదే రూఢియైన సత్యమని మీరు అనుకోనక్కర లేదు," అన్నది.

శర్మ ఆశ్చర్యంతో "చెప్పు లలితా" అంటూ అనునయించాడు.

"కాని ఒక్క షరతు"

"అంగీకరిస్తున్నాను, చెప్పు లలితా."

"మీరీ విషయంగూర్చి సుందరంగారిని అడగనని, వారితో అసలీ విషయం ఎత్తనని బాసచెయ్యాలి."

శర్మకు మరింత ఆశ్చర్యం కలిగింది "సరే" నన్నాడు.

"నేను విన్నదిది. సుందరంగారికి సరోజని మీ వర్గంలో కలసి వయోవిద్యాధ్యాపన చేయటం ఇష్టంలేదట. ఎందువలననో నాకు తెలియదు. నన్ను అడగకండి. అందువల్ల ఆమెకు ఉద్యోగం ఈయలేదట."

శర్మ మొగం ఎఱ్ఱబారింది. కదలికలేని కన్నులు బరువుతూ, "నాతో కలసి వయోవిద్య గరపిందనా? మా సరోజనిలో ఇదొక దోషం కని పెట్టాడా?"

లలిత నిశ్చలంగా పలికింది. "నా కేమీ తెలియదని, నన్ను ఈ ప్రశ్నలువేసి లాభంలేదని మొదటనే చెప్పాను."

"ఇదంతా సరోజనికి తెలుసునా?

"తెలుసు ననుకుంటాను."

"నమ్మి ఉంటుందా?"

"ఏమో మీ సరోజని హృదయం మీకు తెలియాలి శర్మ గారు."

శర్మ ముఖంమీద ఆలోచనా మేఘాలు నీడలల్లుతున్నాయి. కన్ను లొక్క పరి లోతయినాయి. నిట్టూర్పులతో తల కదల్చుతూ, మెల్లగా అన్నాడు "సరో నవ్వి ఉండాలి ఈ కారణం విని."

లోపల నవ్వుతున్న దేమో కాని పైకిమాత్రం పొంగివచ్చే దుఃఖాన్ని అణుచుకోలేక వ్యగ్రపొందింది. నేను చూశాను......" అంటూ లలిత ఆనాటి సాయంత్రం జరిగినదంతా వర్ణించసాగింది.

శర్మ ఎడతెగని ఆలోచనా తరంగాలలో ఈదుతున్నాడు, దారి తెన్ను లేనట్లుగా. సుందరం నిజంగా అలా భావించి వుంటాడా? మరి ఆ సరోజనికి ఉద్యోగం ఇస్తానని ముందు గట్టి మాట ఎందుకు ఇచ్చిఉంటాడు? ఇంతకన్నా ముఖ్యమైన ప్రశ్న: సరోజని ఈ కారణం విశ్వసించి ఉంటుందా? ఏమో తన కార్య క్రమములో పాల్గొని ఉద్యోగం పోగొట్టుకొన్నానని నమ్మి ఉంటుందా? పరుగెత్తుకుపోయి ఆమెను ప్రశ్నిస్తే?

కాని ప్రశ్నించి ఏమిలాభం? తన సరో తనకు తెలియదూ, "ఇది నిజమంటారా" అని తననే అడుగుతుంది. "ఇది విశ్వసించను సరో, అసలు సంగతి క్రమంగా బైటపడవచ్చును" అని తాను చెప్ప వచ్చును. కాని, అది తెలుసుకునే మార్గమేముంది?

ఒకటేమార్గం. సుందరాన్ని పోయి అడుగవచ్చును. సుందరం తన చిన్ననాటి స్నేహితుడు. సుందరం ఆసాయంత్రం రానైనా రాలేదు. అవును. మొగము చెల్లిఉండదు. ఏమో, ఏదైనా తొందర పనిఉండి రాలేకపోయినాడేమో. సుందరం తనకు క్రొత్త వాడు కాదుకదా. పరిగెత్తుకుపోయి అడిగితే—అవును. "లలితా, విను, ఇదెంతవరకు నిజమో నీకు సరిగా తెల్లియదుగా" అన్నాడు.

"తెలియదు."

"ఇది తెలిసికొనే మార్గమెటుకటుంది. నేను పోయి సుందరం గారిని అడుగుతాను."

లలిత దీర్ఘంగా నిట్టూర్చి, పవిట చెంగుతో విసరుకొంటూ; కుర్చీకి పూర్తిగా చేరగిలపడి అన్నది, తొణుకు లేని గొంతుతో: "శర్మగారు, మీరు నాకిచ్చిన బాస చెరించుతారనుకొని మీకీ ఉదంతమంతా వెలిబుచ్చాను. మఱచారా మీ మనస్థితిలో?"

శర్మకు సిగ్గువేసింది, క్షణంక్రింద తాను చేసిన వాగ్దానం తన మనశ్శబలత్వంలో విస్మరించినందుకు. "క్షమించు లలితా, నన్ను నమ్ము. నే నెన్నడు ఈ విషయం సుందరంతో ప్రస్తావించను. సుందరంతోనే కాదు; మరెవ్వరితోను కూడ. మా సరోజకు రాని ఉద్యోగం ఇది తెలుసుకోవటంవల్ల రాదుగదా. కాని నీ వొక సాయం చేయాలి."

లలిత నవ్వుతూ అన్నది "ఏమిటి శర్మగారు? మీకేమయినా చేయగలను."

"నీ పుట్టినరోజు పండుగకు నేను రావాలంటే ఒక షరతు."

"బాగుంది. మగవారు కూడ షరతులు పెడతారా?"

"విను. సరోజను చూచి చాలా రోజులయింది. ఆమెను తప్పక రప్పించు."

"అలాగే. అసలావిడ మీ యిద్దరనే పిలుస్తున్నాను."

"నేను రమ్మన్నానని ప్రత్యేకంగా చెప్పు లలితా."

"అలాగేనండి. లలిత పుట్టిన రోజుకు శర్మగారు నిన్ను లలిత యింటికి ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారని నొక్కి వక్కాణిస్తాను లెండి." లలిత నవ్వుతూ చేతిసంచి గిరగిర త్రిప్పుకుంటూ బైటకు నడిచింది. మర్యాదకు శర్మకూడ నవ్వులు కురిపించాడే కాని, మన సంతా వేసవి ఎడారివలె రేగే ఆలోచనలతో సందేహాలతో మండి పోతోంది.

* * * *

లలితకు ఆనందంగానే గడచింది కాని ఆ సాయంత్రమంతా శర్మకు మాత్రం బరువుగా దిగులుగా తోచింది. తన పుట్టిన రోజుకు అభినందిస్తూ, మిత్రులు పంపిన బహుమతులన్నీ శర్మకు చూపింది. ఒక్కొక్కటీ వివరంగా వర్ణిస్తూ ఆ మిత్రులనుగూర్చి వెనుకటి ముచ్చటలవీ యివీ చెప్తుతూ కాలం పుచ్చింది.

"ఇంతకు నేను కట్టుకొన్న చీర ఎవ రిచ్చారు చెప్పండి శర్మ గారు." ఈ వేడుక ప్రశ్నల నానందించే స్థితిలో లేడు శర్మ. మెల్లగా అన్నాడు "నాకేం తెలుసు? నేను మాత్రం కాదు."

లలిత నవ్వుతూ దగ్గరకు వచ్చి, "చూడండి, యీ పవిట అంచు ఎంత అందంగా ఉందో. ఈ చీరలు, వాని మధ్య మధ్య పువ్వులు—"

"అవును, ఇప్పుడు గుర్తు వచ్చింది. ఆనాడు సరో అంటోంది కదూ నీకు పువ్వుల చీరెలు రవికలు ఉంటే చాల సరదా అని. బహుశా సరో పంపి ఉంటుంది."

"కాదు, శంకరంగారు" అంటూ అప్పుడే వచ్చిన పాకెటు ఒకటి విప్పుతూ, "ఇందులో ఏముంటుంది చెప్పుకోండి" అన్నది.

ఏమి చెప్పాలో తెలియని శర్మకు ఎదురుగా నిలబడి, "చూడండి, నేను చెవుతాను. ఇందులో ఒక జాకెట్టు గుడ్డ ఉంటుంది."

"అవును, పాకెట్ చూస్తే అలాగే ఉంది, చిన్నదిగా, తేలికగా—"

"అయితే ఏ రంగుదో చెప్పండి?"

"నీకు అందం కూర్చే రంగు."

"అంటే—" అంటూ లలిత పాకెట్ విప్పింది. అది సుందరమైన నీలిరంగు జాకెట్టుగుడ్డ ఉంది. అది చూస్తూనే శర్మ కన్నులవెంట రెండు వేడి కన్నీటిబిందువులు కారినాయి. అలాటిదే తాను సరోజకు తెచ్చియిచ్చాడు; ఆ జాకెట్టు ఉద్యోగం వచ్చిన మరునాడు ఆమె ధరించి తనయొద్దకు రావలసిన అదృష్టం వెనుకకు పోయింది.

తలవని తలంపుగా అన్నాడు "ఇది బహుశా సరో పంపించి ఉంటుంది. ఆమె కీరంగు చాలా యిష్టం."

"క్షమించండి శర్మగారు, మీకీ రోజంతా సరోజని నామ స్మరణగా ఉన్నట్లే—"

"ఆమె తప్పక వస్తుందన్నావు కదూ?"

"మీరు వస్తున్నారని, మీరు ప్రత్యేకం ఆమెను రమ్మని కోరారని కూడ చెప్పాను."

శర్మకు ఎప్పటికన్న ఆరాట మెక్కువయింది. ఆమెతో అన్నాడు "లలితా దూరు మీ కుర్రవాడిని పంపుదాము సరోజని యింటికి. పోయి పిలుచుకురమ్మని చెవదాము."

"తప్పక" అంటూ లలిత కుర్రవాడిని పిలిచింది. వాడు ఒక్క గంతున బైటకు ఉరికాడు.

శర్మ కొక ఆలోచన తట్టింది. కుర్రవాడిని పిలిచి ఒక చీటి వ్రాసియిచ్చాడు, తాను ప్రత్యేకంగా రమ్మన్నట్లు.

లలిత తన బహుమతులలోగల వింతలన్నీ వర్ణిస్తోంది. చల్లారుతున్న తేనీరు పారబోసి వేడి టీ పోస్తోంది. శర్మ మనసంతా మాత్రం ఆ కుర్రవాడిమీదుంది.

కుర్రవాడు పరుగెత్తుకు తిరిగివచ్చాడు. శర్మ ఆత్రంగా అడిగాడు. "ఏం వస్తోందా?"

"లేదండీ. అబ్బ...ఆ యిల్లంతా ఎలా ఉందండీ! ఎవరైనా మాత్రం ఎలా రాగలరండీ?"—

శర్మకు అర్థం కాలేదు. లలిత అన్నది "సరిగా చెప్పరా, అసలు సంగతేమిటి?"

"సామానులన్నీ చిందరవందరగా పడిఉన్నాయండి, అమ్మగారూ, అదే పనిగా సర్దుతున్నారు."

శర్మ అడిగాడు, "మరి నా చీటి ఇచ్చావా?"

"చూసుకున్నారు బాబూ, ఈ సర్దటం పూర్తి అయితేగాని కదలనన్నారు."

"ఎంతసేపు పడుతుందో యింకా—" అంటూ శర్మ తన గడియారంవంక చూసుకున్నాడు.

కుర్రవాడు అన్నాడు, "రేపు ప్రొద్దునదాకా కావటండీ."

లలిత అన్నది "ఇక ఈ సాయంత్రం ఇక్కడకు రానట్లే."

"పోనీ నేనే అటుపోతే—" అంటూ శర్మ లేచాడు చేతులు తుడుచుకుంటూ.

కుర్రవాడు వంటింట్లోకి జారుతూ మెల్లగా అన్నాడు "ఏమో, ఈ సామాను సందడిలో ఎవరైనా వచ్చినా చాలా సిగ్గుగా ఉంటుంది అనుకుంటూ తెగ సర్దుతున్నారండీ సరోజనమ్మగారు."

శర్మ కేమీ తోచడంలేదు. ఇంతలో బైట కారు ఆగింది. హారన్ అదేపనిగా మ్రోగుతోంది. లలితకు తెలుసు శంకరం వచ్చాడని, తనవారాత్రి సినిమాకు తీసుకుపోవటానికి.

లలిత బైటకు నడిచింది, శర్మకూడా వెంట వెళ్ళాడు. వెనుకకు తిరిగి లలిత వడివడిగా అన్నది, "శర్మగారు, రెండు రోజులలో నేను పోయి కనుక్కుంటాను. సరోజని నాకూ క్రొత్తగాదుగా. మీకు చెవుతానులెండి."

"మంచిది లలితా" అంటూ శర్మ నెట్టిగా మెట్లు దిగాడు. లలిత గబగబా వానివెంటవెళ్ళి, "శర్మగారు, మీరు వచ్చినందుకు కృతజ్ఞతలు. కాని, సరోజని రానందుకు విచారం వేస్తోంది. మీరు ఆకారులో రావచ్చును, శంకరంగారు మీ యింటివద్ద దించుతారు, మంచివారు" అన్నది.

శంకరం కారువంక చూడకే, "వద్దు నన్ను ఒంటరిగాపోనీ లలితా" అంటూ రెండడుగులు వీధిలోవేశాడో లేదో, హారన్ మ్రోగిస్తూ శంకరం కారు లలితతోసహా రివ్వున పరుగెత్తింది.

* * * *

ఆనాడు బేబీ పుట్టినరోజు పండుగ. తలంటి పోసుకొని, క్రొత్తచొక్కా, క్రొత్తపరికిణీ వేసికొని, తలనిండా అప్పుడే విచ్చిన పువ్వులు అమర్చుకొని గంతులువేస్తూ వచ్చింది శర్మదగ్గరకు. శర్మ బేబీని పైకెత్తి ముద్దు పెట్టుకున్నాడు.

బేబీ అడిగింది "అన్నయ్యా, ఏదీ యింకా రాలేదు? వస్తుంది వస్తుందన్నావు.

సరోజని రాకుండా బేబీ పుట్టినరోజు పండుగ లింతవరకు జరిగియుండలేదు. క్రిందటిఏడు తను సరోజని అక్కయ్య ప్రక్కనున్న పూలతోటలో తిరుగుతూ, పరుగులెత్తుతూ, కథలు చెప్పుకుంటూ, ఎంత హాయిగా గడిపారో బేబీకి నిన్నటివలె గుర్తు ఉన్నది.

"నిజంచెప్పు అన్నయ్యా, సరోజని అక్కయ్యను పిలవలేదా?" శర్మ నవ్వాడు. బేబీ బుగ్గలు నిమురుతూ, "నీ కలా ఎందుకు తోచింది బేబీ?" అన్నాడు.

"అవును, మనింటికి రావటం మానేసిందిగా. అందుకని కోపంవచ్చి—"

శర్మ నవ్వుతూ అన్నాడు "ఈమాత్రానికే కోపంవస్తే ఎలా బేబీ?"

"నాకు నిజంగా వస్తుందిసుమా"

"అందుకే నీవు బేబీవి" అంటూ తనగదిలోనికి వెళ్ళాడు. బేబీ తన పూలగుత్తులనే సరిదిద్దుతూ అద్దంలో చూస్తూ నిల్చుంది. తనకు వచ్చినరీతిగా రంగులకలయిక చేస్తూ మురిసిపోతోంది. ఇంతలో పోష్టుమాను వచ్చాడు.

గబగబా శర్మ గదిలోనికి పరుగెత్తింది "అన్నయ్యా నాకొక పార్సెలు వచ్చింది. నాకే, నాకే—" బేబీ సంతోషానికి మేర లేదు, ఆమె కదే తొలిసారిగా తనపేర ప్రభుత్వ తపాలాశాఖావారిద్వారా పార్సెలొకటి రావటం.

శర్మ అదిచూస్తూ తెల్లపోయినాడు. రాలిపోయిన పూవులాగ ఆయనముఖం కళావిహీనమైంది. బేబీ అది కనిపెట్టింది, మెల్లగా అడిగింది "అన్నయ్యా, నాకు చెప్పవూ—"

బేబీని తన భుజాలదగ్గరకుతీసికొని, తల నిమురుతూఅన్నాడు"

"బేబీ, సరోజని అక్కయ్యరాదు—"

"అని దానిమీద వ్రాసిఉందా?" అని పార్సెలుపైన క్రింద చూసింది, కన్ను లింతచేసుకొని.

ఆమె అమాయకంగా టిక్కు మొగం పెట్టింది. అది గమనించి శర్మ నవ్వుతూ, "బేబీ, ఇది నీకోసమే పంపింది సరోజని అక్కయ్య ఇందులో ఏముంటుందో చెప్పుకో," అన్నాడు.

బేబీకి మరల మొగమింత అయింది. "నాకు తెలుసు అందులో కీ యిచ్చేకారు ఉంటుంది. నిరుడు నాతో చెప్పింది కొనిపెడతానని. తనకు ఉద్యోగమవుతుందట. అప్పుడు చాలా డబ్బు వస్తుందట. నాకు తప్పక కారు కొని పెడతానన్నది."

"కాని, సరోజనికి ఉద్యోగం కాలేదుగా—"

"మరైతే డబ్బు ఎక్కడనుంచి వస్తుంది. అన్నయ్యా?"

శర్మ పార్సెలు పొంతం విప్పాడో లేదో బేబీ అందులోని గౌను లాక్కొనిపోయింది లోపలికి. అయిదునిముసాలలో క్రొత్త డ్రెస్సులో తిరిగివచ్చింది." చూడు అన్నయ్యా, ఎంత చక్కని గౌనో. పోనీలే; ఇదే బాగుంది కారుకన్న."

శర్మ కళ్లు తొలుత సంతోషంలో మెఱసినాయి. క్షణంసేపు దగ్గరగా పరిశీలించాడా నీలిగౌనును. ఆ నీలిగుడ్డ తా నిచ్చినదే సరోజనికి, జాకెట్టు కుట్టించుకోటానికి.

ఎంతో ఆప్యాయంగా తాను బహూకరించాడు. అదే— ఆ బహుమానముచే ఆమె యీ విధంగా త్రిప్పికొట్టింది! లేక—

శర్మకు ఊహ లింతకన్న దూరంపోలేదా క్షణాన. కనుమొదళ్ళలో క్రిందకు రాలని అశ్రుకణం దక్కగా అవతరించింది. బేబీ

తనవంక తిరిగింది, ప్రశ్న వేసినట్లు చూస్తూ. శర్మ ఆమె చెంపలకు తన వ్రేళ్లు మెల్లగా తగిలిస్తూ అన్నాడు "అబ్బో...ఎంత ధగధగ లాడుతోందో యీ గౌను. నా కన్నులు చెదురుతున్నాయి కూడా."

శేరీ తృప్తిచెందిన ముఖం పెట్టింది. "అన్నయ్యా, ఇదిగో పోస్టుమాను ఇచ్చాడు" అంటూ ఒక కవరిచ్చింది.

అది తను సరోజనికి పంపిన ఆహ్వానం తిరిగివచ్చింది. "ఈ చిరునామా గలవారు ఇల్లువదలి వెళ్ళిపోయారు" అన్న ముద్రతో. శర్మ కిప్పుడు తెలిసింది, ఆనాడు ఇల్లు సర్దుతూఉన్న దెందుకో. తన ఆహ్వానం సరోజని ఇల్లు చేరలేదు, ఆమె బహుమతి మాత్రం తన యిల్లుచేరింది. శేరీ అంటే సరోజని కెంతముద్దు! మరువకుండా ఉదయానికి బహుమతి పంపించింది.

ఆ కవరు చూసిచూసి ప్రక్కన పడవేశాడో లేదో శేరీ మరొకటి తెచ్చియిచ్చింది.

"ఇదెక్కడిది?"

"ఇదీ ఆ పోస్టుమానే తెచ్చియిచ్చాడు. నాకు బాగున్నది ముందు ఇచ్చాను. తరువాత ఒకొక్కటే—" అంటూ పెద్దగా నవ్వి వాకిటిలోనికి గంతులేసింది శేరీ, తన తోడిపిల్లలు ఆడుకోటానికి వస్తే.

అది సరోజని తల్లిదగ్గరనుంచి. సరోజనికి ఉద్యోగం రాక పోవటంవల్ల వారందరూ ఆర్థికంగా బీదస్థితిలో ఉన్నారని, సరోజనికికూడా వెనుకటిలా ఆనందంగా జీవితం గడిపేందుకు ధన మంతగా లేదని, డబ్బు ఎద్దడివల్ల అదివరకటి పెద్ద ఇల్లు వదలి మరొక చిన్న యింటిలోనికి మారిందని, ఆమెమీద ఆశ పెట్టుకొని వ్యయభారాని కోర్చి చదువు చెప్పించిన తనకు ఇంకా సంతోషం కలిగే గడియ రాలేదని, ఏదోవిధంగా ఒక ఉద్యోగం శర్మగారు ఆమెకు ఇప్పించ రాదా అని, తప్పక యిప్పించగలరని, అలా అని సరోజనికూడా అనేకసార్లు అన్నదని—ఇలాగే చాల దీర్ఘంగా వ్రాసిందా యిల్లాలు.

సరోజని డబ్బుకిబ్బంది పడుతున్నదన్న ఆలోచనలో శర్మ కుమిలిపోయినాడు. బహుశా అందుకే శేరీకా నీలిగౌను పంపి ఉంటుంది. ఆ ఉత్తరం తిరిగి ఒకసారి చదివాడు బరువైన కన్నులతో. మెల్లగా మడిచి ఉత్తరం జేబులో పెడుతూఉండగా శేరీ తన స్నేహితులతోపాటు గంతులేస్తూ వచ్చింది లోనికి, "అన్నయ్యా సరోజని అక్కయ్య" అంటూ.

శర్మ తటాలున వాకిలివైపు వెళ్ళాడు. శేరీ అన్నది, "ఆ బస్సులో వెడుతోంది. పందెం వేసుకు, మేం పరుగెత్తుతున్నాము. బస్సులాగే స్టాండుదాకా. అక్కడ బస్సు ఆగి ఉంది. లోపలికి చూస్తినిగదా సరోజని అక్కయ్య. ఇదిగో ఈ పూవు గూడా యిచ్చింది. దిగమన్నాను. కాని దిగలేదు. దిక్కుమాలిన బస్సు దిగే దాకా ఆగనే లేదు."

"నేను రమ్మన్నానని చెప్పలేకపోయినావా?"

"నీవు చెప్పలేదుగా నాతో."

శర్మ శేరీ అమాయకత్వానికి నవ్వుతూ నిల్చొన్నాడు. శేరీ అన్నది, "నా గౌనువంక మాత్రం సంతోషంతో చూసింది అన్నయ్యా. బాగుందికదూ అన్నయ్యా, నాకు సరిగా సరిపో యింది."

* * * *

సరోజని బైటకు సరదాగా పోయి చాలా రోజులయింది. ఏవో అవసరమైన వస్తువులు కొనుక్కోవటానికి తప్ప దినము దిన మల్లా యింటిలోనే గడుపుతోంది. మొదట్లో పేపర్లలో వచ్చే ప్రకటనలన్నీ శ్రద్ధలో పరికించేది. కాని క్రమంగా ఆ కుతూహలం సన్నగిల్లింది. ఉద్యోగము అవశ్యకరమయి కాదు. తనలో ఏదో అర్థం కాని అసహ్యం కలిగింది ప్రకటనల నదేపనిగా పరికించటమంటే.

ఆనర్సు పరీక్షకై సిలబస్‌కి సంబంధించిన పుస్తకాలు చదువుతూ ఎన్నో మిగత పుస్తకాలు చదివే వ్యవధిలేక అప్పుడప్పుడు విచారపడుతూఉండేది. ఏ ఇబ్సెన్ను నాటకమో తీసేది ఉత్సాహముతో, కాని అవతల ఏ జోన్ రాబిన్సన్ పుస్తకమో నోరు తెరుచుకున్న దయ్యంలాగా గోచరమయ్యేది. ఏ సోమర్ సెట్ మాఘం కథనో తెరిచేసరికల్లా కొత్తగా ఊడిపడ్డ ఏ మీడ్ యొక్క జామిత్రీ బొమ్మలో మనో నేత్రముందు ప్రదర్శనమయ్యేవి. హారడీ వ్రాసిన కీన్సు జీవితచరిత్రం కూడా సగంకన్న యెక్కువ చదవలేదు. ఎందు కంటే హారడీ వ్రాసిన వనేక మిగత పుస్తకాలు తనకు పాఠ్య గ్రంథాలే నాయె, సరే కీన్సు రచనల మాట చెప్పనే అక్కరలేదు. కొన్ని పేపర్ల కవి బైబిలే!

తనకు ప్రైజులుగా లభించిన సారస్వత గ్రంథాలన్నీ దులిపి టేబిల్ మీద వరుసగా పేర్చింది. ఉదయం కాఫీ త్రాగి ఆ పుస్తకాలు తెరిచేది, మధ్యాహ్న భోజనందాకా చదివేది. భోజనంచేసి తిరిగి అవి చదివేది సాయంత్రందాకా. రాత్రి తిరిగి అదే ధోరణి. ఈ పఠనములో ఆమెకు కొంత శాంతి తోచినట్లు కూడా అనిపించేది.

తన ఈ దినచర్యలో మధ్య మధ్య కలిగే అంతరాయ మొకటే ఉంది. ఏ వారాని కొకమారో తన తల్లిదగ్గరనుంచి ఉత్తరం వస్తుంది. వెనుక తల్లి వ్రాసే ఉత్తరంకోసం కాచి వేచియుండే పిచ్చిపిల్లకు ప్రస్తుతం ఆ లేఖలు కొంత ఖేదం కలిగిస్తున్నాయి.

ఆ దినం రెండు కవర్లు వచ్చినాయి. రెండూ తల్లిదగ్గర నుండియే. ఒకటి బరువుగాఉంది. ఆశ్చర్యంతో ముందు అది తెరిచింది. కన్నీరు దిగమ్రింగుకుంటూ ఆద్యంతమూ చదివింది; మధ్య మధ్య ఆకాశంవంక చూస్తూ.

"సరో, ఇక్కడ నా ఆర్థిక పరిస్థితి నీరసంగా ఉన్నదని పదే పదే చెప్పి నిన్ను బాధించవలసినదానను కాను. చదువుకున్న పిల్లవు. నా హృదయం అర్థం చేసుకోగల తల్లివి......

నేను వ్రాస్తూఉన్న ఉత్తరాలు నాకు చేతనయినంత ప్రియంగా, కష్టం కల్గించనట్లుగా వ్రాయ ప్రయత్నిస్తున్నాను. ఈసంగతి నీవు గ్రహించియే ఉంటావు....

సరో, నీకా ఉద్యోగం రావలసిందే. శర్మగారు తప్పక ఇప్పించి ఉంటారని నీకన్న నే నెక్కువగా విశ్వసించాను. ఇప్ప

టికి నాకా విశ్వాసం సన్నగిల్లలేదు. నీవూ అలాగే అభిప్రాయ పడుతున్నా వనుకుంటాను.

నేనీమధ్య శర్మగారికి ఉత్తరం వ్రాశాను. తిరుగు టపాలో జవాబిచ్చారు. ఆ సమాధానం చూచి ఒక విధంగా ఆశ్చర్యం కల్గింది. నీకు వెంటనే అది పురస్కరించికొని ఉత్తరం వ్రాయలే దంటే ఈ లేఖ ఎలా వ్రాయాలా అని ఆలోచించడంతో సరి పోయిందనుకో.

సరో, నీకు ఉద్యోగం రాలేదని విచారిస్తున్నావు. ఇది సహజమే. కాని శర్మగారికి ఎన్నాళ్లిగానో నీవు కన్పడనేలేదుట. తెలీక కారణాలవల్ల నయిఉంటుందనుకున్నాను.

కాని సరో, నీవు ఇల్లు మార్చిన సంగతి ఇన్నిమైళ్ళ దూరంలోఉన్న నాకు వ్రాశావు కాని అక్కడేఉన్న శర్మగారికి తెలుపలేదుట.

నిజానికి నా కిదేమాత్రము అర్థముకాలేదు. నీవు ఇలా ప్రవర్తించడం ఎంతవరకు సమంజసమో నే నూహించలేను కాని, నీవు శర్మగారిని క్రొత్తగా భావించడం నేను సమర్థించను.

సరో నీవు త్వరగా ఏదైనా ఉద్యోగం సంపాదిస్తే నీకు నాకు మంచిది. ఈ విషయమై ఎక్కువగా నొక్కి చెప్పవలసిన అవసరం లేదుగదా....

శర్మగారు పరపతిగల మనిషి, ఆయన సహాయంతో ఏదైనా ఉద్యోగం తప్పక దొరుకుతుంది. నామాటవిని, సరో, నీకీ క్షణంలో (తాత్కాలికంగా) నచ్చకపోయినా, శర్మగారి దగ్గరకు పోయి వారితో కలసి ఏదైనా ఉద్యోగానికై ప్రయత్నించు. నేను మరల వారికి వ్రాయ నక్కరలేదనుకుంటాను, కానుందుకు అన్నిసార్లు ఆయనను వేధించటం.

ఇది నీ కిష్టం కాకపోయినా—నా కోసమనుకో—"

ఇలాగే గడిచిందా ఉత్తరమంతా. సరోజని కన్నీరు తుడుచుకుంటూ దిండుమీద వొరిగింది. కొంతసేపటివరకు రెండవ ఉత్తరం ఉన్న మాటే మరచింది. తటాలున లేచి అది తెరిచింది.

"సరో, ఇంతకు మునుపే ఉత్తరం పోస్టుచేశాను. ఇప్పుడే "హిందూ"లో ఒక ప్రకటన చూశాను. అది కత్తిరించి ఈ కవరులో పెట్టి పంపుతున్నాను. ఒకవిధంగా ఆశ్చర్యంగా ఉంది. అదే ఉద్యోగం. తిరిగి అప్లికేషనులు పంపుమన్నారు. ఈసారైనా నీవు శర్మగారిద్వారా తప్పక ప్రయత్నించు. ఈసారి నీకు వచ్చి తీరుతుందని నా అంతరాత్మ నాకు చెప్పుతున్నది."

వ్రాసింది తల్లికాకపోతే ఆ అంతరాత్మ బోధనకు అంతగా విలువ యిచ్చేదికాదు ఆ సందర్భంలో. సరోజని ప్రకటన చూచింది. అవును అదే ఉద్యోగం, తాను ప్రయత్నించి విఫలమయినదే, లలిత అలంకరించిన స్థానమే అది. కాక అట్టిదే మరొక పదవియో.

తిరిగి, శర్మగారి సహాయం తీసికోమని తల్లిబోధిస్తున్నది. తన మనసులో ఉన్న భావాలు కొంతవరకు తల్లి ఉత్తరములోనే వెలిబుచ్చిందికాని, అసలు తన మనస్సుకు పట్టిన మబ్బుతెరల సంగతి తల్లికేం తెలుసు.

ఇన్నాళ్ళు శర్మగారింటికి తను పోలేదు. అతడు రానట్లుగా యిల్లు మార్చింది. అతడు వచ్చే పార్టీల జోలికైనా పోలేదు. బేబీ పిలచిన పిలుపులు తనపైన వ్యర్థమయినాయి. శర్మమాత్రం పసికట్టి ఉండడా, ఏదో కారణంగా సరోజని తననుండి దూరంగా సంచరిస్తోందని! ఇప్పుడు తటాలున తానుపోయి తనకి ఉద్యోగం ఇప్పించుమని అర్థిస్తే, శర్మ ఏమనుకుంటాడు. శర్మ ఎంత ఉదార బుద్ధియైనా, తనది మానవహృదయమేగా, తనకే ఎంత సిగ్గుగా ఉంటుంది! ఏమో, తను పోగానే తటాలున "ఏం సరోజనీ, నీవా ఉద్యోగం ఆశమీద వచ్చావుగదూ" అంటే తల పగిలినంత వేదన, హృదయం చితికినంత వ్యథకల్గదా? ఉద్యోగం సంతుష్టికి దోహదమయితేనే కోరదగినదికాని, తీరని ఆరాటం కలిగించే ఉద్యోగం స్వర్గంలోనైనా నిరర్థకంగదా.

ఈ తలపులకు అంతులేదు. ఎన్నిమార్లు తనలో తాను వాదోపవాదాలు పెంచుకున్నా, తనకు కలిగే చిన్నతనం ఒక ప్రక్కన, తల్లి ఉత్తరాలలోని ఆవశ్యకత ఇంకొక ప్రక్కన తిరిగి తిరిగి గోచరమవుతున్నాయి. ఇంతకు సుందరంగారు వెనుక ఏకారణంచేత ఉద్యోగ మీయలేదో ఆ కారణ మిప్పుడు తొలగిందా?

ఏమో. అసలీ ప్రశ్నకు తన కెన్నడు తీరుతెన్నుగల సమాధానం తోచదు. ఆ ప్రశ్న తనకు తీరని సంతాపం కలిగించింది. గాని ఆ ప్రశ్నను వేసికొనే మనస్థైర్య మామెలో లేదు.

ఏమీతోచని కన్నీటి తెరలలో తల్లి ఉత్తరాలు మసిచి వేసింది. తుదిని ఆమె హృదయానికి గుచ్చుకున్న వాక్యమొక్కటే. "ఇది నీ కిష్టంకాకపోయినా, నాకోసమనుకో."

వేగంగా లేచి దుస్తులను మార్చి బయలుదేరింది శర్మయింటి వైపు—కాని త్రోవపొడుగునా తనను చులకనగా చూస్తాడేమో నన్న భ్రమ మాత్రం ఆమెను వీడనేలేదు. అలా జరిగితే, వెంటనే "అంత స్వార్థంగా నాఅంతట నేను రాలేదు, మా తల్లిపోరు పడలేక వచ్చాను." అని పాఠం ఒప్పచెప్పి తిరిగి రావలెనని తనలో తాను నచ్చచెప్పుకొన్నది.

* * * *

శర్మ తన పడకకుర్చీలో విశ్రమించి ఒక ఉత్తరం దీక్షగా చూస్తున్నాడు. బేబీ తనను పలుకరిస్తూ అల్లరిచేస్తూ గంతులు వేస్తూ ఉన్నది. శర్మచేతిలోఉన్న ఉత్తరము మధ్యమధ్య లాగుతూ అతనిని విసిగిస్తోంది. శర్మలేచి, నవ్వుతూ బేబీని ఎత్తుకున్నట్లు ఎత్తుకుని ఎత్తైనకిటికీలో కూర్చోపెట్టాడు. పాపం బేబీ తనంత తాను దిగలేదు. దూకితే పడతానని భయము. నవ్వుతూ సణుగుతూ అలాగే కూర్చుని ఉన్నది.

శర్మ ఉత్తరంచూస్తూ మధ్యమధ్య ఆలోచనగా చూస్తూ ఉన్నాడు. ఇంతలో వీధితలుపు తట్టినచప్పుడు అయింది. బేబీ తటాలున "సరోజనిఅక్కయ్య సరోజనిఅక్కయ్య" అంటూ అరుస్తూ చప్పట్లుకొడుతూ, వీధిలోకిచూస్తూ శర్మవంక చూస్తూ గంతులు వేస్తోంది.

శర్మ ఉలిక్కిపడ్డట్లులేస్తూ, "ఎవరుసరో? ఎవరుసరో!" అన్నాడు.

బైటనుండి సరోజని అన్నది "ఆఁ నేనే సరోజనిని."

శర్మ తలుపు తెరచాడు. తలవంచుకుని సరోజని ప్రవేశించింది. వస్తూనే కిటికీపైపుకుపోయి ఆత్రంగా చేతులెత్తి నిలుచున్న బేబీని దింపుతూ ముద్దుపెట్టుకొన్నది.

శర్మ అడిగారు, "ఎలాఉన్నావుసరో, కులాసాయేనా?"

సరోజని బేబీవంకచూస్తూ రానినవ్వును తెప్పించుకో ప్రయత్నిస్తోంది.

వెంటనే శర్మ అన్నాడు, ఆఁ...అన్నట్లు సరో...నీకా ఉద్యోగంకావాలనేఉన్నదా? కావాలంటే తిరిగి ప్రయత్నించవచ్చు, ఏంసరో—"

సరోజని కన్నులవెంటకారే నీటివరదలలో బేబీతల తడిసిపోయింది, శర్మ అది కనిపెట్టకుండా, కాళ్లను చుట్టుకున్న బేబీని త్రోసుకుంటూ ప్రక్కగదిలోకి పోయింది. బేబి తనను విడిలించుకొని, "ఉండు అక్కయ్యా నా కొత్తగౌను వేసుకువస్తాను" అని లోపలకు పరుగెత్తింది.

ఏ ప్రశ్నకు తాను భయపడిందో ఆప్రశ్న శర్మ వేశాడు. ఏవిషయం శర్మ ప్రప్రథమంగాఎత్తుతే తాను భరించలేక పరువెత్తుకు పోదలచుకొన్నదో అదేప్రశ్న శర్మవేశాడు. స్వార్థచింతలో తాను తిరిగి శర్మయొద్దకు చేరిందన్నస్ఫురణ యేప్రశ్నలో అవగత మవుతుందో అదేప్రశ్న శర్మ ప్రశ్నించాడు.

తనతల్లిప్రోద్బలంమీద తను వచ్చింది. తనకు ఉద్యోగంవస్తే తనతల్లికీ తనకు మంచిదే. కాని ఉద్యోగమే ప్రపంచములో సర్వము కాలేదు. ఉద్యోగంవల్ల ధనం లభిస్తుంది. ధనంవల్ల జీవనములో సౌలభ్యం ఏర్పడుతుంది. కాని అది భౌతికసౌలభ్యమే. అంతకుమించినది మానసికానందం, అది తనకీ ఉద్యోగంవల్ల కల్గదు. తాను ఉద్యోగంచేసిన ప్రతిక్షణము శర్మ తనను స్వార్థిగా తలపోస్తున్నాడన్న మనోవేదన తనను మథిస్తూయుంటుంది. తనను ప్రేమించిన శర్మగారే యిలా భావిస్తే తనకిక మానసికానందమెలా పొసగుతుంది?

సరోజని వంచినతల ఎత్తకుండా ప్రక్కగదిలోనుండి మెల్లగా బయటకు జారింది. శర్మ ఇది గమనించనేలేదు. బేబీ లోనుండి తన నీలిగౌనుతో పరువెత్తుకువచ్చి "ఏదీ సరోజని అక్కయ్య" అనేవరకు.

"ఏదీ సరోజని" అంటూ శర్మ ప్రక్క గదిలోకి వెళ్ళాడు. అప్పటికే పదడుగులదూరంలో రోడ్డుమీద కనపడింది సరోజని. బేబీ పరుగెత్తుకుపోయి రమ్మనట్లు సరోజని చేయి లాగింది. సరోజని తల త్రిప్పుతూ బేబీ చేయి విడిలించుకుంది.

బేబీ కన్నులు నీళ్ళలో తేలే పూవులలాగ అయినాయి. దిక్కుమొగంతో శర్మ దగ్గరకు వచ్చింది. శర్మ ఒక్క నిట్టూర్పు నిట్టూర్చి, గబగబా తన కుర్చీప్రక్కనున్న కవరొకటి తీసి బేబీకిచ్చి, "ఇదిగో ఇది సరోజని కిచ్చిరా, పరుగెత్తుకుపో. ఊఁ. పరుగెత్తు." అన్నాడు.

బేబీ ఒక్క క్షణములో కవరు ఇచ్చి వచ్చింది. శర్మ పోయి తన కుర్చీలో పడుకున్నాడు. బేబీమాత్రము బైటకు చూస్తూ నిల్చున్నది, ఎంతసేపటికి లోనికి రాకుండా. శర్మ పిలిచాడు, "బేబీ, ఇదిగో బొమ్మలు" అంటూ.

"ఉండు అన్నయ్యా, ఇక్కడ బలే బాగుంది. సరోజని అక్కయ్య నిలబడి ఉత్తరం చదువుకుంటోంది అన్నయ్యా...... మధ్య మధ్యనే సరోజని అక్కయ్య మొగం తుడుచుకుంటోంది. అన్నయ్యా...అన్నయ్యా...మరే—" అంటూ బేబీ అదేపనిగా వర్ణిస్తోంది.

సరోజని నిజంగా వెనుదిరిగి చూస్తూ ఉత్తరం చదువుతూ కన్నులు తుడుచుకుంటూ ఏదో నూతనానుభూతిలో తేలిపోతోంది. ఆ కవరు తనకోసం, తనపేరిట ఉంది, కాని శర్మగారి కేర్ ఆఫ్ చిరునామాతో వచ్చింది.

అది వ్రాసింది లలిత. ఆ సంతకం చూడగానే సరోజని ఒళ్లు ఒక్కసారి జల్లుమన్నది. లలిత కనపడి ఎన్నాళ్ళయింది! లలిత తన వెనుకటి స్నేహితురాలు! లలిత తనకు రావలసిన ఉద్యోగం హరించిన పిల్ల!

చివరికిలా ఉన్నది: "వాస్తవానికి నాకు తెలిసినది నా ఉద్యోగం పోయిన దెందుకు మాత్రమే. నా కసలు అది ఎలా వచ్చిందో ఇంతవరకు తెలియదు. నీకు రాని కారణము కూడ నేను చూచాయగా విన్నదేసుమా. నేను చేసిన నేరం నీకిది చెప్పటం. క్షమించు, ఏదో క్షణికమైన దుర్బలత్వమో నాచేత చెప్పించింది."

సరోజని గబగబా పరుగెత్తుకు వచ్చింది శర్మ యింటిలోనికి. వీధి గడపలో నిల్చుని సంతోషంతో అరుస్తున్న బేబీని ప్రక్కకు త్రోసుకుంటూ సరాసరి శర్మగారి కుర్చీ కెదురుగా నిలబడ్డది.

శర్మ తలయెత్తి చూడలేదు, ఇంత రివ్వున వచ్చినది తనమీద వాగ్వర్షం కురిపించిపోవటానికేమోనని.

సరోజని శీతాకాలపు సముద్రపు గాలిలాగా మాటలు దొరలించింది, "ఈ ఉత్తరం వచ్చి ఎన్నాళ్ళయింది?"

"పది రోజులయింది." శర్మ తలయెత్తకే సమాధానమిచ్చాడు.

"పది రోజులే! మరి ఎందుకు చూడలేదు, తెరిచి?"

"అది నీపేరన వచ్చింది."

"తెలుసును. కాని ఎందుకు తెరవలేదు అని అడుగుతున్నాను."

"అది నాది కాదు, నీపేర వచ్చిందని చెప్పాను."

"ఏం తెరచిచూస్తే ప్రపంచం తల్లక్రిందులయ్యేదా?"

"అవును. ఈమధ్య తల్లక్రిందు లయినట్లే తోచింది."

"సరోజని ఉత్తరముతో శర్మ గడ్డము పైకెత్తుతూ అన్నది" అందులో మీ సరో సముద్రములో మునిగిఉంటుందనుకున్నారా?"

ఇది వెనుకటి సరోజని. తాను ప్రేమించిన సరో. తనను వాత్సల్యవృష్టింగా కూర్చగల సరో ఇది. శర్మ తలయెత్తాడు. సరోజని ముఖంలో తుపానుకు బదులు పౌర్ణమినాటి నిండు చంద్రబింబము తలపించింది.

శర్మ మాటాడేముందే సరోజని వానిచేతిలోని కాగితం లాక్కొంటూ "ఇది యేదో ఉత్తరంలాగానే యున్నదే" అంది.

"అవును. అది నాది."

"ఫరవాలేదు" అంటూ సరోజని ఆ లేఖ పూర్తిగా చదువుకుంది.

శర్మ చిరునవ్వుతో మెల్లగా అన్నాడు "సుందరం వ్రాశాడు—"

"అవును సంతకమునుబట్టి తెలుస్తోంది, ఫోర్జరీ అయితే తప్ప."

"ఎన్నాళ్ళయింది అతను వచ్చి, ఒక్క జాబైనా వ్రాసి. కాని అతని మంచితనంలో స్నేహభావంలో నాకు విశ్వాసం ఉంది. చూడు, ఈమారు నిన్ను ఉద్యోగానికి దరఖాస్తు పెట్టమన్నాడు."

సరోజని ఉత్తరం మఱల చదివి, "అవును ఇందులోని విషయం చాలా చక్కగా పారాఫ్రేజ్ చేశారు" అంది.

కొన్ని నెలలు లేని కాంతిరేఖలు, ఆశాకిరణాలు, ఆమె ముఖములో ఆ క్షణాన వికసించినాయి. కనులనుండి రాలే వేడి నీటి బిందువును తుడుచుకోవటం కూడా విస్మరించిన సరోజని తటాలున త్రుళ్ళిపడింది వాకిటిలో కారు చప్పుడు విని.

సరోజని, శర్మ, వీధి తలుపువైపు వెళ్ళారు. సుందరం వచ్చాడు.

శర్మ చేయి ఊపుతూ సుందరం అన్నాడు, "ఆహా మా సరోజని కూడ ఇక్కడనే ఉన్నదే!" "ఇప్పుడే వచ్చింది. అదృష్టవశాత్తూ నీవు ఈ వేళకే వచ్చావు సుందరం. నీ ఉత్తరం అందింది."

"అదిగో అందినట్లు తెలుస్తూనే ఉంది." అంటూ సుందరం సరోజనివైపు చూశాడు. ఆమె పెదవి కొరుక్కొని ఆ ఉత్తరం ప్రక్కనున్న టేబిల్ మీద పెట్టింది.

సుందరం మొదలుపెట్టాడు. "ఏం శర్మా, నీకు నా ప్రవర్తన వింతగొల్పి ఉంటుంది. సరోజనికి ఉద్యోగం ఎందుకీయలేదో యిన్నాళ్ళిగా చెప్పని కారణం చెప్పమంటావా?"

"నీయిష్టం. నా అంతట నేనే ఎందుకు అడగాలి?"

సరోజనివంక చూస్తూ సుందరం అన్నాడు, "బహుశా ఆమెకు వినాలని కుతూహలంగా ఉండి ఉంటుంది."

సరోజని ఓరకనులతో వెంటనే పలికింది, "శర్మగారికి చెప్పతలచుకోనిది నాకుమాత్రం దేనికండీ?"

సుందరం నవ్వుతూ, "విను శర్మా. ఆమెకు ఉద్యోగంరాని కారణం నీవు."

విభ్రాంతిపోయినట్లు, శర్మ తలయెత్తాడు. తటాలున సరోజని వంక చూశాడు. సరోజని ముఖం క్షణము మబ్బుల వెనుక చంద్రునిలా చంద్రుడు లేని పద్మంలా అయిపోయింది.

అర్థంకాని తెల్లదనంతో సుందరం కనుకోణాలు సరోజని వంక తిరిగినాయి. "శర్మా, నీవు శంకరాన్ని ఎరుగున్నావు కాదూ?"

"ఆఁ....ఆవేళ మన పార్టీకి వచ్చాడు."

"ఆఁ. అతడే. ఏమనుకుంటావు అతనిని గురించి?"

శర్మ ఏమి జవాబు చెప్పలేదు. సరోజని ముఖంమాత్రం వాడిన పూవులాగ వ్రేలవేసింది.

"నీవేమనుకున్నా ఫరవాలేదు శర్మా. సరోజనికి మాత్రం సుందరం అంటే అసహనం."

సరోజని కోపంతో నిట్టూర్చి రెక్కలు లాగిన పక్షిలాగ కెవ్వున అరిచింది, "నాకు అవసరంలేని వ్యక్తులనుగురించి నాకు ఉండే లేని అభిప్రాయాలతో మీ కెందుకండీ?"

"సరోజనీ, గాలివేస్తోందో లేదో పూలతీగను అడగనక్కర లేదు, చూస్తేచాలు. నేనా పార్టీలోనే కనుపెట్టాను నీకు అతనికి పడదని."

సరోజనికి కోపం మైకం కమ్మినట్లయింది, "ఇంతకు నాకు అతనికి పడకపోవటం ప్రసక్తిఎందుకు? నేనతని స్నేహం కోరేనా ఏమైనానా?"

సుందరం మొదలుపెట్టాడు, "శంకరం మా ఆఫీసులో కార్మిక శాఖకు అధిపతి. నీ ఉద్యోగం వాని శాఖలోనిది. అతనితో సామరస్యం లేనివారు క్షణంకూడ అపని చేయలేని పరిస్థితి అది. ఏం, అర్థమవుతోందా సరోజనీ?"

సరోజని ముఖంలో కొంచెము తెలిచాయలు తొలకరింప దొడగినాయి. సుందరం తిరిగి పల్కసాగాడు, "చివర కేమయిందో చూశారా? ఆ లలితకూడా తగినకే దొరికింది. శంకరం ప్రవర్తనబట్టి అప్పుడే అతనిని తొలగించవలెనని అనుకున్నానుగాని, వ్యవహారరీత్యా తగినంత గట్టికారణం చూపించటం కష్టమనిపించింది. సరే క్రమంగా లలిత శంకరం నిప్పుకు గాలిలా విజృంభించారు. వారి ప్రవర్తన వ్యక్తిగతంగా అవమానకరం కావటమే కాకుండా, మా వ్యాపార సంస్థకుకూడా కళంకకారణం కాజొచ్చింది. ఇప్పుడు నాకు కేవలం వ్యవహార రీత్యా తగిన కారణం దొరికింది వానిని తొలగించటానికి, వానితోపాటు లలితను."

మారుమాటలేక బొమ్మవలె నిల్చున్న శర్మ సరోజనులను చూస్తూ సుందరం అన్నాడు, "శర్మా, నీకు సరోజనిమీద ఎంత వాత్సల్యమో నాకు తెలుసును. ఆమెకు శ్రేయస్కరం కాని పరిస్థితులలో ఆమెను ఇరికించటం నీకు కష్టం కల్గించేదికాని తృప్తినీయలేకపోయేది. నీకు తృప్తిని కలిగించనిపని నేనుచేసి యేమి లాభం? ఈమె నీ సరోజని కాక మరొక సరోజని అయివుంటే ఆనాడే ఉద్యోగం ఇచ్చివుండేవాడిని. థ్యాంక్సు అనవసరంగదా!"

సరోజని శర్మవంక ఒకసారి నిండుగా చూసి ఎన్నడు తాను పొందనంత చిన్నతనంతో తల వంచుకుంది.

సుందరం పూర్తిచేశాడు, "శర్మా యిన్నాళ్ళు నీకు చెప్పవలెనని ఉబలాటపడేవాడిని గాని, తొందరపడి యితర వ్యక్తుల ప్రవర్తనలను గురించి ముచ్చటించట మెందుకన్న ఆత్మబలంతో నిశ్శబ్దం వహించి ఉన్నాను. నీవు కూడ ఆ ప్రసక్తి లేకుండా నాకు కొంత శాంతిని కలిగించావు."

సరోజనివంక చూస్తూ అడిగాడు, "ఏం సరోజనీ నీకు ఉద్యోగం రానిది నా మూలంగా కాదు. అసలు కారణం శర్మ."

* * * *

ఒకరి మనస్సు మరొకరికి స్ఫుటంగా సంపూర్ణంగా అవగతమయితే వ్యక్తుల జీవితాలలో ఎంత సామరస్యం కాంతి చేకూరుతుంది. కాని మానవజాతి కంత అదృష్టం అరుదు. మానవుని మనస్సు ఏ క్షణంలో ఎలా ప్రవర్తిస్తుందో ఊహించటం కష్టం; అంతేకాక మనస్థితి వ్యక్తీకరణకు అంతరాయం కలిగించే ముఖ్యహేతువు పరిస్థితుల ప్రత్యేకత. ఇవి అడ్డతెరలా అమరుతూ ఉంటాయి.

మానవుని శారీరక ప్రవర్తనను సూత్రీకరించటం మనస్తత్వ ప్రవర్తనను సూత్రీకరించటంకన్న ఎన్నోవిధాల సులభం. నిజానికి, అది నిర్దుష్టంగా విస్పష్టంగా చిత్రించగలిగినవాడు మానవ జీవితంలో క్షోభ తిరుగుతుందేమో! తెలియనిదానికోసం పడే తపనలో ఉన్న ఆనందం ఒలిచిన అరటిపండులో లేదు. మనం ప్రేమించిన వ్యక్తి మనస్సు మన కొక పాలసముద్రం వంటిది. అది కదలిక లేని కాసారంగా కాక, వెల్లువ లుబికించే తరంగాలుగా ఉంటే మనకు కలిగే ఆనందం సంతుష్టి అనంతం.